క్లుప్తంగా

కూటమి విజయంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

సత్తెనపల్లి: గత ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని, ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఉపాధ్యాయులు మద్దతు ఇవ్వాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కోరారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం పట్టణంలో శ్రీ రాఘవేంద్ర బాలకుటీర్, బాబా గురుదేవ్ డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు. ఉపాధ్యాయులు, ప్రతిభావంతులు, మేధావులు కూటమి అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. శ్రీ రాఘవేంద్ర బాలకుటీర్ బాధ్యుడు వెలుగూరి సుబ్బరాయుడు, ప్రిన్సిపాల్ ఎం.గీతాంజలి, శ్రీవాసవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, బాబా గురుదేవ్ డిగ్రీ, పీజీ కళాశాల డైరెక్టర్ మట్టా సుబ్రమణ్యేశ్వర రావు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, నాయకులు ఉన్నారు.

శ్రీవారికి మాఘ పౌర్ణమి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: శ్రీమహావిష్ణువుకు ప్రియమైన మాఘ మాసంలో పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్నపన తిరుమంజనం, శ్రీవారికి ప్రత్యేక అలంకారం, విశేష హారతులు, అష్టోత్తర శత నామావళి కైంకర్యాలు విశేషంగా నిర్వహించారు. అలాగే వైభవోపేతంగా శ్రీవారికి గరుడ వాహన సేవ నిర్వహించారు. రాత్రికి గరుడ ముద్ద ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం ఏకాంత సేవ, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీవారి ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏపీ ఎన్‌జీజీఓస్ క్యాలెండర్ ఆవిష్కరణ

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా క్యాలెండర్‌ను సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి ఆవిష్కరించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏపీ ఎన్‌జీజీఓస్ సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు పెండెం మణిరావు ఆధ్వర్యంలో జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీజీఓస్ సెక్రటరీ అంబేడ్కర్, వైస్ ప్రెసిడెంట్‌లు కుసుమకుమారి, చింతల చిట్టిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ఎస్ శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, ఇబ్రహీం, టైగర్ నాగేశ్వరరావు, చందు, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు



రాజుపాలెం: మండలంలోని దేవరంపాడులో సత్తెనపల్లి న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు ప్యానల్ న్యాయవాది అమరయ్య నాయక్ ఇంటింటా తిరిగి బుధవారం సర్వే నిర్వహించారు. ఆయనతో పాటు పారాలీగల్ వలంటీర్ కోటా బాబూరావు పాల్గొని దివ్యాంగులు, మానసిక వికలాంగులు, చెవిటి, మూగ తదితర పిల్లలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నాగమణి, ఎంఎల్‌హెచ్‌ఓ తేజస్విని, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీవో జీవీ సత్యనారాయణ

రాజుపాలెం: ఈ నెల 27న కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నందున పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ అయ్యే వరకు గ్రామాలలో రాజకీయ నాయకుల బ్యానర్స్ ఏర్పాటు చేయకుండా నిరోధించాలని తెలిపారు. రాజుపాలెం మండల పరిషత్ పాఠశాలలో పోలింగ్ బూత్ ఉన్నందున విద్యుత్‌తో పాటు అన్ని సౌకర్యాలు ఉండే విధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా గంగాదేవి పేరంటాళమ్మ తిరునాళ్ల

- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు



అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు (ఇన్‌సెట్‌లో) పూజలందుకుంటున్న గంగమ్మతల్లి

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లు గ్రామంలో ఎత్తయిన కొండ గుహలో స్వయంభుగా వెలసిన గంగాదేవి పేరంటాళమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. వేకువ జాము నుంచే భక్తుల అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయం ముందు యాదవ సోదరుల వీరతాడు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కోరిన కోర్కెలు తీర్చే తల్లి

150 అడుగుల ఎత్తయిన కొండ గుహలో 1200 సంవత్సరాల క్రితం గంగమ్మతల్లి స్వయంభుగా వెలిశారని, అప్పటి నుంచి ప్రతి యేటా క్రమం తప్పకుండా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున అమ్మవారికి తిరునాళ్ల మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ఉండే చెరువును ఓర్వకల్లు, రుద్రవరం, గ్రంథశిరి గ్రామాల వారు సేద్యపు నీరుగా వినియోగించుకుంటూ పంటలు పండించుకుంటున్నారు. అందువల్లనే ఈ తిరునాళ్ల వేడుకలను మూడు గ్రామాల వారు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వయంభుగా వెలసిన గంగమ్మతల్లిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరతాయని, సంతాన ప్రాప్తి కలుగుతుందన్న నమ్మకంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల వారు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

తెల్లవారుజాము నుంచే పూజలు

తెల్లవారు జామును 5 గంటల నుంచి అమ్మవారికి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ముద్ర పూలు ఉత్సవాలు, జనివాడ చదరంగం పూజలు నిర్వహించారు. దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎం.కోటేశ్వరరావు పర్యవేక్షణలో పూజలు, అభిషేకాలు అత్యంత వైభవంగా జరిగాయి. వ్యాపారవేత్త మేకా గోవింద రెడ్డి భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అమ్మవారి దర్శనం టికెట్లకు, కొబ్బరికాయల విక్రయాలకు, అమ్మవారికి సమర్పించే చీర, జాకెట్ ముక్కల విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించుకునేందుకు ఆలయం వద్ద ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దారు జి.శ్రీనివాసరావు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తిరునాళ్ల మహోత్సవాలను పర్యవేక్షించారు. అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. అచ్చంపేట, భక్తుల సౌకర్యం కోసం అమరావతి, క్రోసూరు మండలాల నుంచి ఓర్వకల్లుకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిపారు.



దేవాలయం ముందు పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు

ఓర్వకల్లు తిరునాళ్లకు తరలివెళ్లిన భక్తులు

క్రోసూరు: అచ్చంపేట మండలంలోని ఓర్లకల్లు గ్రామంలో గంగాదేవీ పేరాంటాళ్లమ్మ తిరునాళ్లకు బుధవారం క్రోసూరు మండలం నుంచి భారీగా భక్తులు తరలివెళ్లారు. తిరునాళ్లలో భక్తులు అమ్మవారిని మొక్కులు చెల్లించుకుని పొంగళ్లు పెట్టుకున్నారు. దేవదాయ శాఖ ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పకడ్బందీగా చేసింది. ఉచిత అన్నదానాలు, తాగునీరు, అంగళ్ల ఏర్పాట్లతో తిరునాళ్ల భక్తులు సందడితో కోలాహలంగా సాగింది. తిరిగి వచ్చే నెల ఇదేరోజు భక్తులు అమ్మవారికి నెల పొంగళ్లు పెట్టుకుంటారు.

నెలాఖరు కల్లా రైతులు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలి

ఏవో వేణుగోపాల్



గుడిపాడులో రైతుల వివరాలను పరిశీలిస్తున్న ఏవో వేణుగోపాల్

క్రోసూరు: రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలను పారదర్శకం, సులభతరం చేయడం కోసం వెబ్ ల్యాండ్‌లో పొలం కలిగి ఉన్న ప్రతి ఒక్క రైతుకు 'ప్రత్యేక గుర్తింపు సంఖ్య'ను ఇస్తున్నట్లు ఏవో వేణుగోపాల్ తెలియజేశారు. మండలంలోని గుడిపాడు, 88 తాళ్లూరు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతు సేవా కేంద్రాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రత్యేక సంఖ్య కలిగిన రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల లబ్ధి చేకూరుతుందని తెలియజేశారు. కావున రైతులందరూ రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలని తెలిపారు. ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందేందుకు పట్టాదారు పాస్ పుస్తకం లేదా అడంగల్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, ఆధార్‌కు లింకు అయిన ఫోను నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందుటకు ప్రభుత్వం ఈ నెలాఖరును గడువుగా నిర్ణయించిందని తెలిపారు. ఈ రబీ సీజన్‌లో మండలంలో పంటలను సాగు చేసిన రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-పంట నమోదుకు ఈ నెల 15వ తేదీ ఆఖరు అని, కావున రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి ఈ-పంట యాప్‌లో నమోదై ఉందో లేదో సరి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఖాజా మొయినుద్దీన్, ఆరిఫ్, రైతులు పాల్గొన్నారు.

ఈ నెల 15లోగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు

నకరికల్లు: ఈ నెల 15వ తేదీలోగా ఈ క్రాప్ బుకింగ్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. మండలంలోని దేచవరం, చల్లగుండ్ల అడ్డరోడ్డు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేస్తున్న అన్నిరకాల పంటలకు ఫార్మర్ ఈ కేవైసీ నమోదు చేసుకుంటేనే సంక్షేమ పథకాలు రైతులకు వర్తిస్తాయని అన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్టర్ ఐడీ నంబర్ నమోదు చేసుకున్న ప్రతి రైతుకు జారీ చేయబడుతుందన్నారు. రబీ సాగుదారు రైతులు ఆధార్ కార్డుతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం నకలు, ఆధార్ లింక్ చేయబడిన ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ కె.రవి బాబు, వ్యవసాయ విస్తరణాధికారి కె.దిలీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.


రైతు రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలి

మాదల(ముప్పాళ్ళ): రైతులందరూ రైతు రిజిస్ట్రీ చేయించుకోవాలని, నమోదు చేసుకోకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, రాయితీలు వర్తించవని జిల్లా రీసోర్స్ సెంటర్ శాస్త్రవేత్త డా.నగేష్ చెప్పారు. మండలంలోని మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న, శనగ పంటలను బుధవారం పరిశీలించారు. మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోవచ్చని తెలిపారు. శనగ పంటలో ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మావిరిడి వాడాలని సూచించారు. వరిలో ఆకులు లేత పసుపు రంగులోకి వస్తున్నాయని, నివారణకు జింక్ స్ప్రే చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, డీఆర్సీ ఏఓ ప్రవీణ్, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శనగ పంటను పరిశీలించి సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త నగేష్, ప్రవీణ్, అరుణ

ఘనంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యల కల్యాణం



శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి

సత్తెనపల్లి: పట్టణంలోని నరసరావుపేటరోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి వారి 31వ వార్షిక కల్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, కాకాని గోపయ్య స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. మేళ తాళాలు, కనక తప్పెట్లు, మహిళల కోలాటం నడుమ గ్రామోత్సవం సాగింది. అనంతరం జలబిందెల కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అమ్మవారి సేవకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాసవీ అమ్మవారికి లక్ష తులసీ దళాలతో పూజలు



సత్తెనపల్లి: మాఘ పౌర్ణమి, లలితా మహా త్రిపుర సుందరి జయంతి పర్వదినాలను పురస్కరించుకొని పట్టణంలోని మాచర్ల రోడ్డులో గల వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని లక్ష తులసీ దళాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. గత 15 సంవత్సరాలుగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణకు సహకరిస్తున్న దాతలు కీర్తిశేషులు కొప్పురావూరి అప్పారావు ధర్మపత్ని వెంకటలక్ష్మి కుసుమకుమారిల కుమారులు వెంకట నాగసత్య కిషోర్‌బాబు, వెంకట నాగ బాల ఆంజనేయ ప్రసాద్ ఆదిత్యల కుటుంబాలకు అమ్మవారి అనుగ్రహం ఎల్లవేళలా కలగాలని కాంక్షించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా దేవస్థానం ప్రెసిడెంట్ బొమ్ము వెంకటేశ్వర్లు, గోశాల ప్రెసిడెంట్ పెండ్యాల కాశి మల్లేశ్వరరావులు పర్యవేక్షించారు.

డాక్టర్ రమాదేవికి స్టార్ గోల్డెన్ అవార్డు ప్రదానం



అవార్డు, సత్కారం అందుకుంటున్న డాక్టర్ సరికొండ రమాదేవి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు, రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి స్టార్ గోల్డెన్ అవార్డు, ఘంటసాల జాతీయ స్ఫూర్తి సేవా అవార్డును ప్రదానం చేశారు. సాహిత్యం, సేవా దృక్పథాన్ని దృష్టిలో పెట్టుకొని లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా-2025 ఘంటసాల జయంతి సందర్భంగా ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఈ నెల 11న అవార్డులు అందించారు. ఇందులో భాగంగా రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి అవార్డుతోపాటు మెమెంటో, సర్టిఫికెట్, గోల్డ్ కప్పు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ సంస్థల అధినేతలు, కార్యదర్శులు, పుర ప్రముఖులు డాక్టర్ సరికొండ రమాదేవిని బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

వైభవంగా రాధాకృష్ణుల కల్యాణం



రాధాకృష్ణుల కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని బలభద్ర సహిత జగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారికి కల్యాణం జరిపించారు. దంపతులు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా బుధవారం స్వామి వారి గరుడ వాహన ఊరేగింపు, కోలాటం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కార్మికుల ప్రయోజనాలే పరమావధి

ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104) ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు జీసీహెచ్ కొండలు



ఎస్ఈ విజయ కుమార్‌కు షీల్డు అందజేస్తున్న యూనియన్ నాయకులు

నరసరావుపేట: కార్మికుల ప్రయోజనాలే పరమావధిగా తమ యూనియన్ 75ఏళ్లుగా పనిచేస్తుందని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు జీసీహెచ్ కొండలు పేర్కొన్నారు. బుధవారం యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా బరంపేటలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో నూతన యూనియన్ జెండా ఆవిష్కరణ మహోత్సవం నిర్వహించారు. అధ్యక్షులు జెండాను, సూపరిండెంటింగ్ ఇంజినీర్ ప్రత్తిపాటి విజయకుమార్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్.రాంబోట్లు, యూనియన్ జిల్లా కార్యదర్శి క్రోసూరి రవిశంకర్, సీనియర్ నాయకులు మంచాల మౌళి, భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆర్.బంగారయ్య మాట్లాడారు. అసిస్టెంట్ ఇంజనీర్లు, కార్మికులు నాయకులు రవిచంద్ర, రామయ్యలు వైభవంగా నిర్వహించారు.

గార్లపాటి దాసుకు సన్మానం



క్రోసూరు: బంగారునంది, అబ్దుల్‌కలాం లైఫ్‌టైం అచీవ్‌మెంట్ పురస్కార గ్రహీత గార్లపాటి దాసును బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. స్థానిక మాజీ యార్డు చైర్మన్ డాక్టర్ ఎం.షరీఫ్ ఇంట్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ మహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ దాసు ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ కొరకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, తెల్లమేకల అంజి యాదవ్, చిలకా ప్రభాకర్, గార్లపాటి జీవరత్నం, చిలకా నాగరాజు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి విజయం సాధించాలి



నకరికల్లు: ప్రభుత్వం ద్వారా పంపిణీ చేసిన స్పెషల్ మెటీరియల్ చదివి మంచి ఫలితాలు సాధించాలని డీఈఓ ఎల్.చంద్రకళ పదో తరగతి విద్యార్థులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎస్.పూర్ణచంద్రరరావు, ఎంఈఓ-2 ఎంఎల్ఎస్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు టి.నగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీసర్వే పనుల పరిశీలన

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనుల ను (డీఎస్ఎల్‌వో) పల్నాడు జిల్లా సర్వే భూమి రికార్డులు కొలతల అధికారి చేజర్ల భానుకీర్తి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు రైతుల సమక్షంలో రెవెన్యూ అధికారులు రీసర్వే పనులు చేయాలన్నారు. రెవెన్యూ టీమ్స్ ప్రతి రోజు 20 ఎకరాలు తగ్గకుండా భూముల నిజనిర్ధారణ పనులు జరుగుతున్నాయన్నారు. భూములు సర్వే చేస్తున్న రైతులకు నోటీసులు అందజేయాలన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు లక్ష్మణరావుకు వేసి గెలిపించాలి



సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మహిళా సంఘం జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో లక్ష్మణరావు గెలుపును కాంక్షిస్తూ బుధవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటుపల్లి రజని మాట్లాడుతూ పట్టభద్రులు, మేధావులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే కేఎస్ లక్ష్మణరావు గెలుపులో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు గెలుపును కాంక్షిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం పట్టణ కమిటీ సభ్యురాలు ధరణికోట విమల, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జడ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల రికార్డులు సిద్ధం చేయండి

డ్వామా పీడీ గురుమూర్తి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గురుమూర్తి

క్రోసూరు: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై అన్ని శాఖల అధికారులు తమ తమ శాఖల రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని డ్వామా పీడీ గురుమూర్తి కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై మండలంలోని అధికారులు, ఉపాధి హామీ సోషల్ ఆడిట్ సీఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీడీ మాట్లాడారు. మండలంలో రూ.6 కోట్ల ఉపాధి హామీ పనులు పూర్తి చేయటం జరిగిందన్నారు. ఆ పనులకు సంబంధించిన రికార్డులు సిద్ధం చేసుకుంటే గ్రామాల్లో సోషల్ ఆడిట్ టీం పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తారని అన్నారు. ఈ నెల 21న బహిరంగ సోషల్ ఆడిట్ ఫోరం ఉంటుందని, కావున సక్రమంగా రికార్డులు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీనివాస్, ఏపీడీ కేవీ నారాయణ, ఎస్.ఆర్.పీరాజు, ఏపీవో వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్, హౌసింగ్, స్కూల్ ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డీఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లెదర్‌పార్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న కొరియా దేశ ప్రతినిధులు

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామ పరిధిలోని బీబీసీ (బఫెలో బ్రీడింగ్ సెంటర్) భూముల్లో లెదర్ పార్క్ నిర్మాణానికి గాను కొరియా దేశ ప్రతినిధులు బుధవారం భూములను పరిశీలించారు. బీబీసీ పరిధిలోని 75 ఎకరాల విస్తీర్ణంలో భూమిని పరిశీలించి వివరాలు సేకరించారు. ఏపీ ఈడీబీ ప్రతినిధి కె.రంజిత్ ఆధ్వర్యంలో కొరియా దేశం నుంచి ఔసాంగ్ ఎంటర్ ప్రైజస్ సీఈఓ బాబ్, కీ, రెయిన్, సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ కె.పుల్లారావుల బృందం పర్యటించారు. భూములకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. లెదర్ పార్క్ ఏర్పాటుకు కావలసిన మౌలిక వసతులు, అనుకూల, ప్రతికూలతలపై చర్చలు చేశారు. వారి వెంట పలువురు అధికారులు ఉన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న ఏవీ నాగేశ్వరరావు

వినుకొండ(నూజెండ్ల): కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉద్యోగులకు, కార్మికులకు, కర్షకులకు, అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనాలు చేకూరుస్తామని బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు నష్టం కలిగించేలా తీసుకుంటున్న నిర్ణయాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ప్రచార నిమిత్తం పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో స్థూపం సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేసి 4 శాతం మార్జిన్ ఇచ్చేలా ప్రైవేటు కాంట్రాక్టర్ల ద్వారా ఉద్యోగులను నియమించేలా తీసుకున్న నిర్ణయాన్ని తమ జేఏసీ ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని అన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయనాయక్, యూటీఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.